# రంగుటద్దాలు

బండి కదిలి ఊరికి దూరంగా పరుగెత్తుతూంటే ఆత్రంగా, బాధగా చెట్ల గుబురుల మధ్యనుంచి తొంగి తొంగి చూస్తోంది ఆ ఊరు. ఏమిటో-ఆ వూరితో నాలుగు రోజుల పరిచయమే అయినప్పటికీ దాన్ని విడిచిపోవడం చాలా బాధగా వుంది. ఎవరో ఆత్మీయుల్ని విడచి వెళ్ళిపోతున్నట్టు దిగులు ఆవరించింది. చీకటిలోనుంచి వందలాది విద్యుద్దీపాల కళ్ళతో ఆ ఊరు చూస్తున్నట్టనిపిస్తోంది. ఆ భావన వచ్చినప్పుడు ఆ ఊరిని ఓ స్త్రీతో పోల్చుకుని, ఎవరి ప్రేమనో తిరస్కరించి వెళ్ళిపోతున్నట్టు భావించుకుంటున్నాను. జరీచీర ఒత్తుగా వళ్ళంతా కప్పుకున్నట్టు, చీకటి మధ్య మినుకు మినుకుమనే వందలాది దీపాలతో మెరుస్తోన్న ఆ ఊరిని వెనక్కుతిరిగి చూస్తూ కూర్చున్నాను.

ఒక్కసారిగా నా భుజాల్ని ఎవరో కుదిపేస్తున్నారు. ముందుకు తిరిగి చూశాను. కన్నాజీరావు నవ్వుతూ "హైదరాబాదు ఎప్పుడొచ్చావు?" అంటున్నాడు. చెప్పాను, పనిమీద హైదరాబాదు వచ్చి వెళ్ళిపోతున్నానని. అతను ఎక్కడికి వెడుతున్నాడో అడిగాను. అతని చిన్నాన్న కూతురు పెళ్ళట. అందుకని కాకినాడ వెళ్తున్నాడట.

మరో సీటులో వున్న తన సామానుల్ని మోసుకొచ్చి నా ఎదురుగా పడేసి కూర్చున్నాడు. కాలేజీ విషయాలు, తన వైవాహిక జీవితంలోని అనుభవాలు ఏకరవు పెడుతున్నాడు. వింటున్నాను. మధ్య మధ్య నిద్రమత్తుతో కళ్ళు మూతలు

పడుతున్నాయి. జనతా బయలుదేరే సరికే పదకొండు కావచ్చింది. మత్తుగా వుంది. ఓపిక పట్టి అతను చెప్పేవన్నీ ఆలకిస్తున్నాను.

"వసంతను కలుసుకున్నావా?" అన్నాడు, కాలేజీ విషయాలమీదనుండి ఒక్కసారిగా ఆమె వద్దకు ఎగిరివచ్చి.

"ఏం, ఆమె హైదరాబాదులోనే వుంటున్నదా?" అన్నాను.

"ఇక్కడే రేడియో స్టేషన్‌లో పనిచేస్తోంది" అన్నాడు.

ఆమె హైదరాబాదులోనే వుంటున్నదని తెలిస్తే ఆమెను తప్పకుండా కలుసుకుందును. ఆమెను గురించి చాలా చాలా విషయాల్ని విన్నాను. ఆమెను కలుసుకుంటే, అవి ఎంతవరకూ నిజమో కొంతవరకు తెలుసుకోవచ్చు.

కొంతమంది మనుషుల జీవితాలతో విచిత్రంగా చెలగాటాలాడుతూ వుంటారు. అంతకుముందు ఆ విషయాన్ని కథల్లో చదివాను. ఆ తర్వాత ఆమెను చూచి ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. కనిపించిన వారందరికీ ఆశకల్పించి తనచుట్టూ తిప్పుకొని విచిత్రంగా నవ్వుతూ చూస్తూవుంటుంది. ఆమె జీవితంలో ప్రవేశించిన మగవారి సంఖ్య, బహుశా ఆమెకే జ్ఞాపకం వుండివుండదు. ఒకసారి వ్యంగ్యంగా అన్నాను-మీలాంటివారు తప్పకుండా డైరీ ఒకటి వ్రాస్తూ వుండడం మంచిది. ముందు ముందు ఏ రచయితన్నా దాన్ని చక్కటి నవలగా మలచుకోవచ్చు-అని. ఆ వ్యంగ్యం ఆమెకు అర్థంకాలేదు కాబోలు, ఆమె ముఖంలో ఏ మార్పూ కనిపించలేదు.

"ఈమధ్య వాసమూర్తి వచ్చి చాలారోజులపాటు ఈ ఊళ్ళోనే వున్నాడు"- అన్నాడు కన్నాజీరావు.

వాసమూర్తి వస్తే ఆ విషయాన్ని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం కనిపించలేదు. అతను చెప్పదలచుకున్నది అంతమాత్రమే కాదని అర్థమైంది.

"వస్తే అందులో విశేషమేముంది?" అన్నాను.

అతను ఓమారు విచిత్రంగా నావైపు చూసి "నీకు తెలీదా?" అన్నాడు.

తెలీదన్నట్లు తల ఊపాను. ఓసారి నవ్వి "భలేవాడివే. మన వాళ్ళల్లో తెలీనివాడివంటూ నువ్వే కనిపించావు! ఏం మనిషివోయ్, కూపస్తమండూకంలా నువ్వూ, నీ ఆఫీసూ తప్ప వేరే విషయాలేమీ అక్కర్లేదల్లేవుంది" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. ఆ విషయం వినాలని కుతూహలంగా వుంది.

మాటలాడకుండా వుంటే అతనే ఆ విషయం మొదలు పెడతాడు. నేను నిశ్శబ్దంగా అతని ముఖంలోకి చూశాను, వసంతా వాసమూర్తుల కథ చెప్పమన్నట్లు. అతను చెప్పడం ప్రారంభించాడు.

"వసంతను అసహ్యించుకున్న వాళ్ళల్లో వాసమూర్తి ఒకడు. తొలిరోజుల్లో ఆమెను గురించి చెడుగా ప్రచారం చేసేవాడు...."

"ఆ విషయాలు నాకు తెలుసు. అసలు విషయం చెప్పు" అన్నాను అతన్ని మధ్యలో ఆపి.

అతను సర్లే అన్నట్లు చూసి మళ్ళీ మొదలుపెట్టాడు.

"ఆరోజు వర్షం ఉదయంనుంచీ కురుస్తూనే వుంది. మధ్యాహ్నానికి కొద్దిగా తెరిపి యిచ్చి సాయంకాలంనుంచి కుండపోతగా పడుతోంది. కాలేజీ విడిచిపెట్టారు. చాలామంది రిక్షాల్లో వెళ్ళిపోయారు. కొద్దిగా వర్షం తగ్గినట్టనిపించగానే, అంతకన్నా తగ్గదని, అదే అవకాశంగా మరికొంతమంది వెళ్ళిపోయారు. మిగిలిన కొద్దిమందీ వరండాలో చేరి కబుర్లు చెప్పుకొంటున్నారు.

వాసమూర్తి ఆ రోజు ఫులెన్‌ఫేంటు తొడుక్కుని వచ్చాడు. వర్షం పూర్తిగా తగ్గితేగాని వెళ్ళకూడదనుకున్నాడు. రామ్మూర్తిని పిలుచుకొనివచ్చి ఓ గదిలో కబుర్లు చెప్పుతూ కూర్చున్నాడు.

ఆరోజు ఉదయం క్లాసులో లెక్చరర్ కోప్పడుతున్నప్పుడు ముఖంతిరిగి పడిపోయిన వసంతమీద వాళ్ళ సంభాషణ నడిచింది.

"ఆ అమ్మాయి నిజంగా ఫిట్సువచ్చి పడిపోయిందంటావా?" అన్నాడు రామ్మూర్తి.

"లేదు. అదంతా నటన. క్లాసులో వందమందిముందూ నిలబెట్టి ఏకధాటిని లెక్చరర్ చీవాట్లు పెడుతోంటే, తలకొట్టేసినంతపనై మరో మార్గంలేక ఆ ఎత్తు వేసింది." అన్నాడు వాసమూర్తి.

ఆ తర్వాత ఆమెను గురించి చాలా చాలా చెప్పాడు. ఓరోజు వాసమూర్తి, మిత్రుడితో సెకండ్‌షో సినిమాకు వెళ్ళివస్తోంటే టాపున్న రిక్షాలో వసంత, మరొకతను వెళ్తుండడం చూశాడట. ఇంకో రాత్రి వసంత యింట్లోంచి కృష్ణమూర్తి రావడంచూసి కావాలని కృష్ణమూర్తిని పలకరించాడట.

ఆ ప్రసంగానికి అంతులేదు. అలా చెప్పుకపోతున్నాడు వాసమూర్తి. రామ్మూర్తికి కూడా చాలా సరదాగా ఉన్నట్టుంది, మాట్లాడకుండా వింటున్నాడు.

వసంత అలా వెళ్తూ లోపలినుండి తనపేరు వినిపించడంతో ఆగిపోయింది.

వాసమూర్తి, రామ్మూర్తి వర్షం తగ్గినట్టుందని గదిలోంచి వరండాలోకి వచ్చేసరికి ఎట్టి ఎదుట వసంత కనిపించింది!

ఆమె ఏమీ మాట్లాడలేదు. అయిదు నిమిషాలు సూటిగా వాసమూర్తి ముఖంలోకి చూసి చరచరా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

వాసమూర్తి భయపడ్డాడు. మర్నాడు ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేస్తుందేమోనని రెండు రోజులపాటు కాలేజీకు వెళ్ళలేదు.

మూడోరోజు కాలేజీకు వచ్చినప్పుడు ఆమె అతన్ని చూసి ఫక్కున నవ్వింది...."

బండి ఏదో స్టేషనుకు వచ్చి ఆగింది. జనం బిలబిలమంటూ పెట్టెలోకి వచ్చిపడ్డారు.పెళ్ళివాళ్ళలా వున్నారు. చోటులేకపోతే బెంచీల మధ్యకొచ్చి నుంచున్నారు. కన్నాజీరావు కసురుకున్నాడు మరోపెట్టెలో ఎక్కకూడదా అని.

" రెండు స్టేషన్లావల దిగిపోయేదానికి ఎక్కడయితేనేం బాబూ!" అన్నాడు వాళ్ళలో ఓ ముసలాయన.

ఇద్దరిమధ్యా జనం అడ్డుగోడలా నుంచున్నారు. కన్నాజీరావు సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. నేను కిటికీలోంచి దూరంగా చూస్తూ ఆలోచిస్తున్నాను. కన్నాజీరావు జీవితంతో దాగుడుమూతలాడుతూ అతని కళ్ళకు గంతలుకట్టి వసంత ఎందుకు వెళ్ళిపోవాల్సివచ్చిందో అర్థంకాలేదు.

మరీ చిన్నప్పుడు కన్నాజీరావు వసంతని వీపుమీద ఎక్కించుకుని గుర్రబ్బండి లాగేవాడు. ఆమె అతని నోటిలోంచి కళ్ళెంలా ఓ తాడును లాగి తన ఇష్టంవచ్చినట్టు అతన్ని నడిపించేది. అతను సరిగ్గా కదలకపోతే ఆమె అతని వీపుమీద వేపబరికెతో నాలుగు వడ్డించేది. ఒక్కోసారి దెబ్బ గట్టిగా తగిలి వీపుమీద తట్టుతేరేది. కళ్ళనీళ్ళు తిరిగేవి. అయినా అది ఆట గనుక అతను ఏడ్చేవాడుకాదు. బాధను భరించేసి, నవ్వేసేవాడు.

ఒక్కొక్కప్పుడు ఆమెను మొయ్యలేక కిందకు పడవేసేవాడు. అప్పుడామె ఏడ్చుకొంటూ వెళ్ళి అతని తాతగారితో చెప్పేది. ఆయన కన్నాజీరావుని కోప్పడి ఆ అమ్మాయి చేతిలో రెండు రాగి కానులు పెట్టేవాడు. ఏడుపుమాని ఆ డబ్బుల్ని బొడ్లో దోపుకుని ఒక్కర్తేపారిపోయి జంతికలు కొనుక్కొని దేవాలయంలో ఒంటరిగా కూర్చుని

తినేది. కన్నాజీరావు వెళ్ళి అడిగినా పెట్టేదికాదు. అతనికి యీసారి నిజంగా కళ్ళనీళ్ళు తిరిగేవి. అలిగి, యిక ఎప్పుడూ ఆమెతో మాట్లాడనని బుగ్గలు గిల్లుకొని వెళ్ళిపోయేవాడు. కాని మళ్ళీ ఉదయం అయ్యేసరికి పలకా బలపం పట్టుకుని ఆమె ఇంటికివెళ్ళి, ఆమెను వెంటబెట్టుకోకుండా బడికి వెళ్ళేవాడుకాడు.

ఒకరోజు వసంత గుప్పెటనిండా డబ్బులు పట్టుకొచ్చింది. వాళ్ళ అమ్మమ్మ ఊరువెళ్తూ తలో రెండణాలూ యిచ్చిందట. ఆ రెండణాలు పుచ్చుకుని కోమటి కొట్లో దమ్మిడీలు మార్చిందట.

గుప్పెట చూపుతూ "గుర్రబ్బండి కడితే నీకు దమ్మిడీ ఇస్తాను" అంది.

అతను వీపుమీద ఎక్కించుకున్నాడు. గుర్రం బయలుదేరేముందు మెల్లమెల్లగా అడుగులు వేస్తుందిగనుక అతనూ మెల్ల మెల్లగా కదిలాడు. "గుర్రం పరుగెత్తాలి" అంది ఆమె. అతను గబగబా మోకాళ్ళతో పరుగెత్తాడు. ఒకచోట మోకాలు గీరుకుపోయి రక్తం చిమ్మింది. నొప్పిపుట్టి ఆగిపోయాడు.

"గుర్రం ఇప్పుడప్పుడే ఆగకూడదు" అంది వసంత అయినా అతను కదల్లేదు "అయితే నీకు దమ్మిడీ యివ్వనమ్మా" అంది వసంత.

అతను కదిలాడు. నాలుగడుగుల దూరం వెళ్ళినతరువాత "గుర్రం గెంతాలి" అంది. అతను మోకాళ్ళమీద ఎగిరి గెంతాడు. పట్టుతప్పి బోర్లాపడింది వసంత. అక్కడ కంకరరాయి ఒకటి వుంది. కంటి పైభాగంలో అది గుచ్చుకుని నెత్తురు చిమ్మింది. అతనికి భయంవేసి పారిపోయాడు. ఆ రోజల్లా అతను ఇంటికి వెళ్ళలేదు. దేవాలయంలో దాగున్నాడు. మధ్యాహ్నం ఆకలి బాగావేసింది. అయినా యింటికి వెళ్ళలేదు. కుళాయిలో నీళ్ళుతాగి మండపంలో నిద్రపోయాడు. తెలివివచ్చి చూస్తే ఎదురుగా వాళ్ళనాన్న, మావయ్య నుంచున్నారు. వాళ్ళేమీ అనలేదుగాని యింటికి తీసుకుపోయారు.

వసంత కనపడుతుందేమోనని నాలుగురోజులు భీష్మించుకు కూర్చుని స్కూలుకు వెళ్ళలేదు అతను. అయిదో రోజున వసంతే వచ్చింది తలకు కట్టుకట్టుకుని యిద్దరూ స్కూలుకు వెళ్ళారు. అప్పటినుండి గుర్రబ్బండి ఆట ఆడ్డం మానేశారు.

నిద్ర ముంచుకొస్తోంది నాకు. కళ్ళు మూతలు పడుతున్నాయి. వసంత, కన్నాజీరావుల రూపాలు అలుక్కుపోయాయి అంతా చీకటి. చీకటిలో ఒక్కడ్నే నడుచుకొని వస్తున్నాను. అప్పుడే సినిమా విడచిపెట్టారు. దగ్గర్లోని బస్‌స్టాపు చేరుకుందామని గబగబా నడుస్తున్నాను. ఒక వీధి దీపంకింద డబ్బులు లెక్కపెట్టి రిక్షావాడికిస్తోంది వసంత. పలకరించనా వద్దా అని ఆలోచిస్తున్న నన్ను చూసి నవ్వి

"హైదరాబాదు ఎప్పుడొచ్చారు?" అంది తనే.

చెప్పాను. రిక్షావాడికి డబ్బులిచ్చి పంపేసింది.

ఆ దీపంకిందే అరగంట నిలబెట్టి మాట్లాడింది. తనకు రేడియోలో ఉద్యోగం వచ్చిందట. అది రావడానికి తను ఎన్ని అవస్థలు పడిందీ చెప్పింది. ప్రస్తుతం తను ఒక్కర్తీ ఉంటున్నదట.

సన్నగా వానతుంపర ప్రారంభమైంది. బట్టలు కొద్దిగా తడిశాయి. వర్షంలో తడవడం యిష్టంలేక రిక్షాలో వెళ్ళిపోదామని చూస్తున్నాను.

"మా ఇంటికి వెళ్దాం రండి" అంది వసంత. ఆ ఎదురుగా ఉన్న డాబాలో ఒక భాగాన్ని చూపించింది.

నాకెందుకో వెళ్ళాలనిపించలేదు. ఆమెకు కలగాల్సిన భయం నాకు కలిగింది. మర్నాడు ఉదయం కలుసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాను. ఆమె పెదవులమీద విచిత్రమైన నవ్వు ఒకటి కదిలి చీకటిలో కలిసిపోయింది.

మర్నాడు కాఫీతాగి ఆమె వద్దకు బయలుదేరాను. ఇంటికి వెళ్ళేసరికి ఆమె స్నానం చేస్తోందట. గదిలో కూర్చోమని పనిపిల్ల చెప్పింది. కూర్చొని టేబులుమీది పుస్తకం తీసి చదువుతున్నాను. అంతకుముందు ఆ పుస్తకాన్ని ఆమె చదువుతున్నట్లుంది, మధ్యలో ఒకచోట ఆనవాలుగా చిన్నకాగితం పేజీల మధ్యపెట్టింది. ఆ పేజీయే తీశాను. ఒకచోట కొన్ని లైనులు సిరాతో మార్కుచేసి ఉన్నాయి.

'......... స్త్రీకి ఏదోపని నిర్ణయించాముగా! అది చెయ్యకూడదా అంటారు. ఇంత విశాల ప్రపంచంలో గూళ్ళవలె ఇల్లుకట్టి వాటిల్లో స్త్రీలని పెట్టి, జైలులో వలె కొన్ని పనులు చెప్పి కర్రపుచ్చుకొని చేయించడానికి ఎవడిచ్చాడా అధికారం....'

మార్కుచేసిన లైనులవి. పుస్తకం తిరగ వేశాను. మధ్యలో యింకా అలాంటివే చాలా గీతలు కనిపించాయి. చలం పుస్తకం అది.

వసంత వచ్చింది. చీరకుచ్చిళ్ళను కెరటాల్లా లేపుకుని, పవిట సర్దుకుని "ఆలస్యం అయ్యింది క్షమించండి" అంది. నాతో మాట్లాడుతూనే స్టౌ వెలిగించి కాఫీ కాచి యిచ్చింది.

"ఈ ఒంటరి బ్రతుకు మీకు బాధగా లేదూ?" అన్నాను.

"బాధగానే ఉంది, ఏంచెయ్యనూ, తప్పదుమరి. ఒక్కోసారి యీ ఒంటరితనం

లోంచి దూరంగా పారిపోవాలనిపిస్తుంది." అంది.

"అంటే?" అన్నాను.

నిజానికి ఆమె అన్న వాక్యానికి అర్థం నాకు తెలుసు. కాని ఆమె నోటిమీదుగా ఆ అభిప్రాయాన్ని చెప్పిద్దామని నా ఊహ.

"ఈ ఏకాంతం భయంకరంగా అనిపించినప్పుడు స్వేచ్ఛగా రెక్కలు విప్పుకుని ఎగిరిపోవాలనిపిస్తుంది" అంది.

ఇంకా విపులంగా ఆమెచేత ఆ అభిప్రాయాన్ని చెప్పించాలని వున్నదికాని నాకే అసహ్యం వేసి అడగలేదు.

పదింటివరకూ అక్కడే వున్నాను. ఇక వెళ్ళిపోదామని లేచాను.

"ఎక్కడికి వెళ్తారు. కూర్చోండి. హైదరాబాదు ఏమీ చూడలేదుగా. నేనూ వస్తాను. ఇద్దరం కలిసి వూరుచూద్దాం. ఇవ్వాళ ఆఫీసుకు సెలవు పెడుతున్నాను." అంది. లోపలికి వెళ్ళి నాలుగైదు మేగజైనులు తెచ్చి నా ముందు పడేసి చూస్తూఉండండి. పదినిమిషాల్లో తల దువ్వుకుని వచ్చేస్తాను" అంది.

నాకు పుస్తకాలు చదవాలనిపించలేదు. కుర్చీలో వెనక్కుజారబడి కళ్ళుమూసు కున్నాను.

కళ్ళు తెరిచాను. కన్నాజీరావు చాలా సేపటినుంచి లేపుతున్నట్టుంది. నవ్వుతూ "నిద్రపోతున్నావా? భలేవాడివే! మళ్ళీ ఎంత కాలానికి కలుసుకుంటామో, ఈ ఒక్కరాత్రి కబుర్లతో గడిపేద్దామనుకుంటుంటే కునికిపాట్లు పడుతున్నావేమిటి!! ఇదో-ఈ సిగరెట్టు వెలిగించు, నిద్ర తేలిపోతుంది" అంటూ సిగరెట్టు అందించాడు.

సిగరెట్టు వెలిగించాను.

పెళ్ళివారు దిగిపోయినట్టున్నారు. పెట్టంతా ఖాళీగా ఉంది. రైలు గాలిపొరల్ని దూసుకుపోతోంది. కిటికీలోంచి బయటకి చూస్తున్నాను. బయట పొలాల్లో వెన్నెల వాలి మేత మేస్తోంది. స్వప్నంలోని ఏదో అందమైన లోకంలా ప్రకృతి వింతకాంతిలో మునిగి పోయింది.

"శరత్కాలపు వెన్నెల ఎంత అందంగా వుంటుందో!" అన్నాను కన్నాజీరావుతో.

"అన్నట్టు! వసంతను గురించి చెప్తూ ఆపివేశాను కదూ?" అన్నాడు అతను.

అవునన్నట్టు తలవూపాను.

అతను తిరిగి ప్రారంభించాడు-

"వాసమూర్తి ఎదురయినప్పుడల్లా వసంత ఫక్కుమని నవ్వేది. ఆ నవ్వు ప్రేమతో పసరడంలేదని, ఏడిపించడానికే అని, అతనిచుట్టూ వున్న మిత్రులకు అర్థమయిపోయింది. అప్పటినుంచీ వాళ్ళూ వాసమూర్తిని ఏడిపించడం మొదలుపెట్టారు.

మొదట్లో ఆమెను అసహ్యించుకున్నవాడల్లా ఆమె తనను ఏడిపిస్తోంటే సరదా అనిపించేది. అప్పుడప్పుడు బాధకలిగినా అదోరకమైన ఆనందంగా భావించేవాడు. అతన్ని ఏడిపించడం వసంతకు ఓ సరదా అయిపోయింది! ఒకరకంగా ఆమెకు కాలక్షేపంగా ఉంటుండేది.

ఒకరోజు కాలేజీ విడిచిపెట్టిన తరువాత వసంత వాసమూర్తి గురించి ఎదురుచూస్తూ వరండాలో నుంచుంది. వాసమూర్తి యింటికి వెళ్ళిపోదామని బయలుదేరుతున్నాడు.

ఆమె మృదువుగా అతని పేరెట్టి పిలిచింది.

"వాసమూర్తి ఆగిపోయి ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"మీతో అవసరమైన పనుంది. రేపు ఉదయం కాలేజీకు వెళ్ళేముందు ఒకసారి మాయింటికి రండి" అంది. అతను "అలానే" అన్నాడు.

ఆమె వెళ్ళిపోయింది. అతని చుట్టూ వున్న మిత్రులు వీపుచరిచి "భలే అదృష్టవంతుడివోయ్" అన్నారు. అతని ఉత్సాహపు పొంగు మిత్రుల పొగడ్తలతో మరీ ఎక్కువై పెదవుల మీదనుంచి పొర్లిపోయింది. వాళ్ళందరికీ హోటల్లో కాఫీలు యిప్పించాడు.

ఆ మర్నాడు ఎనిమిదింటికే అందంగా తయారయి, అతనికి బాగా యిష్టమైన ఫులెన్ఫేంటు తొడుక్కుని, వైట్సిల్కు బుష్షర్టు వేసుకున్నాడు. టక్‌చేసి, పౌడరద్దుకుని ఆమె ఇంటికి బయలుదేరాడు.

అతని గురించే ఆమె ఎదురు చూస్తోంది. అతను రాగానే టిఫిను, కాఫీ ఇచ్చింది. కడుపునిండుగా ఉన్నా ప్రేమతో ఆమె పెట్టిన కాఫీ టిఫిన్లను వద్దనడం యిష్టంలేక మెల్లగా పూర్తిచేశాడు.

"అందాకా కూర్చోండి, యిప్పుడే వస్తాను" అని ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

అతనికేమీ తోచడం లేదు. ఏమైనా మేగజైనులు వుంటే చదువుతూ గడిపేవాడు. అవికూడా లేవు. ఒక్కడూ అలా గోడలవంక చూస్తూ కూర్చున్నాడు.

తొమ్మిదిన్నర అయ్యింది. అంతసేపూ అలానే కూర్చున్నాడు. అవతల

కాలేజీకికూడా టయిమవుతోంది. ఇంతకూ, ఆమె ఎందుకు పిలిచిందో అర్థంకాలేదు.

ఆమె టాయిలెట్ అయి వస్తూనే "పాపం! ఒక్కర్నీ కూర్చోబెట్టి వెళ్ళిపోయాను ఏంచేస్తున్నారు" అంది.

"ఫరవాలేదు లెండి" అన్నాడు బాధను అణచుకుని.

ఆమె నవ్వి ఒకమారు లోపలికి వెళ్ళింది. ఉయ్యాల్లో నిద్రపోతున్న చంటిదాన్ని లేపి తీసుకొచ్చి "మా అక్కకూతుర్ని చూశారా! నాలుగోనెల" అంటూ అతనికందించింది.

అతనికి అంత చిన్న పిల్లల్ని ఎత్తుకోవడం చాతకాదు. అయినా ఆ విషయం పైకి తెలియకుండా ఎత్తుకుని బుగ్గలు గిల్లి, చిటికెలువేసి ముద్దులాడుతున్నాడు. ఆమె చూస్తూ నిలుచుంది.

"మీ అక్క కూతురు అచ్చం మీ పోలికే!" అన్నాడు.

ఆమె నవ్వి "ఇంతకూ ఇద్దర్లో ఎవరందంగా వున్నామంటారు?" అంది?

అతను కాస్సేపు తికమకపడి "మీరే" అన్నాడు.

ఆమె నవ్వేందుకు కాబోలు కాస్సేపు వీధిలోకి వెళ్ళిపోయి అయిదు నిమిషాల తర్వాత లోపలికి వచ్చింది

ఆమె వచ్చేసరికి అతను ఎలాంటి అవస్థలో ఉన్నాడో చూసేసరికి ఆమె నవ్వాపుకోలేకపోయింది.

చంటిపాప అప్పుడే నిద్రలేచిందేమో అతని ఫేంటుని, చొక్కాను తడిపివేసింది. ముచ్చటగా తొడుక్కున్న ఉలెన్ ఫేంటుమీద చిలికి ఖరాబు చేసింది.

వసంత బలవంతంగా నవ్వాపుకుని "అయ్యో! పాపం, ఇప్పుడెలా." అంటూ చంటిపాపను అందుకుని లోపలికి వెళ్ళిపోయింది. చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి "వరండాలో కడుక్కుందురుగాని రండి. చంటిపిల్లలంటే నాకు అందుకే చిరాకు, ముద్దుగా ఎత్తుకుంటే ముద్దు ముక్కలుచేసి సంభావన వడ్డిస్తారు" అంది.

అతను నీళ్ళు అందుకుని ఫేంటు శుభ్రం చేసుకుందామని వరండాలోకి వచ్చేసరికి రాగలత, మరో ముగ్గురు అతనితో చదువుకునే అమ్మాయిలు వరండాలో నిలబడి పకపకా నవ్వుతున్నారు. వాళ్ళు అప్పుడే వచ్చినట్లు లేరు. అంతకుముందునుంచే అక్కడ ఉన్నట్టనిపించారు.

వాసమూర్తికి తలకొట్టేసినట్టయింది. ఆమె అంత తెలివిగా ఏడిపించినందుకు

ఒకవైపు దుఃఖం, మరొకవైపు కోపం పుట్టుకొచ్చాయి. బట్టలు శుభ్రంచేసుకుని విసురుగా బయటకు వెళ్ళిపోయాడు. ఆరోజు అతను కాలేజీకి వెళ్ళలేదు."

కన్నాజీరావు చెప్పటం ఆపి సిగరెట్టు తీసి వెలిగించాడు.

ఏదో క్రాసింగు ఉన్నట్టుంది. బండి ఓ పల్లెటూరు స్టేషన్లో ఆగిపోయింది. కన్నాజీరావు చూసొస్తానని క్రిందకు దిగాడు. నన్నూ పెట్టెదిగి రమ్మన్నాడు గాని మత్తుగా వుండి వెళ్ళలేదు. బడ్డీలపక్కనే వరుసగా పేర్చిన కర్రపలకలున్నాయి. కన్నాజీరావు వెళ్ళి, వాటిమీద కూర్చున్నాడు. అతనికి తోడు మరొకాయనకూడా పక్కన చేరాడు. ఇద్దరూ కబుర్లలోపడ్డారు.

వెన్నెల్లో కన్నాజీరావు అలా కూర్చుంటే చాలాకాలం క్రిందట వాళ్ళడాబామీద వసంతతో వెన్నెల్లో అమాయకంగా కూర్చున్న అతను మనసులో మెదిలాడు. ఆ చిత్రం కళ్ళముందు కనిపిస్తోంది.

అలాంటి సమయాలు వాళ్ళజీవితంలో చాలా గడిచాయి.

చిన్నప్పుడు గుర్రబ్బండి ఆట ఆడకపోతే అదోలా వుండేది వాళ్ళకు. ఇప్పుడు ఎదురెదురుగా కూర్చుని నిశ్శబ్దంగా ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకోకపోతే అదోలా వుంటుంది.

ఆరేళ్ళపాటు ఆమె అతని జీవితానికి దూరంగా వెళ్ళిపోయింది. ఉద్యోగరీత్యా వసంతనాన్నగారు పట్నం వెళ్ళిపోయారు. కన్నాజీరావుకు బడికి వెళ్ళేందుకు, ఆడుకోటానికి ఎవరూ తోడులేకుండా పోయారు. ఆ వీధిలో ఇంకా యిద్దరబ్బాయిలు, ఒకమ్మాయి అతని యీడువారు ఉన్నా వాళ్ళు అతనితో కలిసేవారు కాదు. ఆ ఆరేళ్ళు అతని జీవితంలో నిర్మానుష్యమైన ఎడారి.

ఆరేళ్ళ తర్వాత కన్నాజీరావు పట్నం వచ్చెయ్యాల్సివచ్చింది. అతనితండ్రి చనిపోయాడు. చిన్నాయన అతని చదువుసంధ్యలు చూసుకుంటానని పట్నం రప్పించాడు. అక్కడే హైస్కూల్లో చేరాడు.

వసంతావాళ్ళూ ఎక్కడుంటున్నారో వెళ్ళి కలుసుకోవాలని వుండేది మనసులో అనుకోకుండా ఒకరోజు వసంతే వచ్చింది. లక్ష్మీదేవిలా పసుపు ముఖానికి పులుముకుని నిండుగా మెడకు చేతులకు ఆభరణాలు తగిలించుకుని పేరంటానికి తల్లితో వచ్చింది. అప్పుడు చూశాడు ఆమెను. మొదట్లో గుర్తుపట్టలేదు. వాళ్ళమ్మను చూశాక వసంతే అనిపించింది.

చాలా పొడుగు ఎదిగిపోయింది. వింతైన అందం, ఆకర్షణ శరీరపు అన్ని వంపుల్లోనూ నింపుకుంది. గాలికి వోణీ ఎగిరి టపటపమంది.

ఎడమ కంటి పైభాగంలో మచ్చ మరికాస్త పెద్దదయింది. 'ఇప్పుడు గుర్రబ్బండి కడతానంటే వస్తుందా?' అని అనుకొని తనలో తానే నవ్వుకున్నాడు. ఈ ఆరేళ్ళూ వసంత తనను మర్చిపోయివుండదు.

"నువ్వొచ్చి ఎంతకాలమైంది.?" అంది వసంత.

"నెలదాటుతుంది" అన్నాడు కన్నాజీరావు.

"రేపు మా ఇంటికి ఒకసారి రాగూడదూ!" అంది.

"ఎక్కడుంటున్నారు?"

"పిన్నికి తెలుసులే.అడుగు, చెప్తుంది"

"అలానే".

వసంత తల్లి పిన్నితో అతని గురించే మాట్లాడుతోంది. అతను అక్కడినుండి మరో గదిలోకి వెళ్ళిపోయాడు. వసంతకూడా తన వెనకనే వస్తుందనుకున్నాడు గాని రాలేదు.

వసంత తల్లి "అప్పుడప్పుడు మా యింటికి వస్తుండవోయ్" అంది.

అలానే అన్నట్టుగా తల ఊపాడు. వాళ్ళు వెళ్ళిపోయారు. 'వసంత నడకలో ఎంత అందం ఉంది!' అనుకున్నాడతను.

వసంత యింటికి అప్పుడప్పుడు వెళ్తుండేవాడు. ఆమె తల్లి చాలా ఆప్యాయంగా చూస్తుండేది. కన్నాజీరావు వసంత ఇంటికి వెళ్ళినప్పుడు ఇద్దరూ కలిసి కూర్చుని లెక్కలు చేసుకునేవారు. ఇంగ్లీషు పద్యాలు ఒకరికొకరు అప్పజెప్పుకునేవారు.

కన్నాజీరావు కొద్దిగా బొమ్మలు గీస్తుండేవాడు. వసంత తన సైన్సు బొమ్మలు, సాంఘికశాస్త్రంలో ప్రపంచ పటాలు, పౌరశిక్షణలోను, డ్రాయింగులోను చిత్రాలు అతని చేత వేయించేది. "నువ్వు చాలా చక్కగా రాస్తావు. నా నోట్సులు కాస్త రాసిపెట్టవూ!" అంటూ ఆ నోట్సులన్నీ అతనిముందు పడేసేది. వారానికి మూడు రోజులన్నా అతనికి ఆమె నోట్సులు రాయడం, బొమ్మలు గీయడం తప్పేదికాదు.

తరచుగా అతన్ని రమ్మంటుండేది ఆమె. అతను వెళ్ళినరోజున యిరువురూ కేరమ్సు ఆడుకుంటూ కూర్చునేవారు. వాళ్ళ నాన్నగారు వచ్చేముందుమాత్రం పుస్తకాలు

తీసేవారు. ఆయన ఒక్కొక్కప్పుడు, తీరికనిపిస్తే యిద్దర్నీ కూర్చోబెట్టి పాఠాలు చెప్పేవారు. ఫోర్తుఫారం, ఫిఫ్తుఫారం యిద్దరూ మంచి మార్కులతో పాసయ్యారు.

పెద్దవాళ్ళవుతున్న కొద్దీ పూర్వంఅంత స్వేచ్ఛ తగ్గిపోయింది. "అస్తమానం వాళ్ళింటికి వెళ్ళడం బావుండదు నాయనా!" అంది పిన్ని. అతను వెళ్ళడం తగ్గించేశాడు. ఆదివారాల్లో మాత్రం వెళ్ళేవాడు. మునుపటిలా ఒంటరిగా ఆమె అతనితో యిప్పుడు మాట్లాడడంలేదు. నలుగురిమధ్యా కూర్చుని అందరిలాగే మాట్లాడేది. అతనికెందుకో ఒంటరిగా ఆమెతో కూర్చుని మాట్లాడాలనిపించేది. ఆ అభిప్రాయం అతనికి కొత్తకొత్తగా కలుగుతోంది. డాబామీద వెన్నెట్లో అంతకు ముందులా ఆమెతో కలిసి కూర్చోవాలనీ, చిన్నప్పటి విషయాలు జ్ఞాపకం చేసుకుని మధురంగా ఆలోచించుకోవాలనీ, కాలాన్ని మూగగా గడిపేయాలనీ ఏవేవో కోరికలు.

స్కూలుఫైనలు రిజల్టు వచ్చాయి.

అతను పాసయ్యాడు

వసంతకూడా పాసయ్యింది.

రిజల్టు చూసినవెంటనే వసంత యింటికి వెళ్ళాడు. ఆ శుభవార్త ఆమె చెవిలో వేశాడు. సంతోషంతో ఎగిరిగంతేసింది. ఇంటిల్లిపాదికీ ఆ వార్త చెప్పింది.

"నీతో పనుంది. అప్పుడే వెళ్ళిపోకోయ్" అంది వసంత తల్లి. వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఇరువురూ డాబామీదకు వెళ్ళి పిట్టగోడకానుకుని కూర్చున్నారు. పిట్టగోడవరకూ వ్యాపించిన పలవల్లో చేతికందేంత దూరంలో ఓ పండు ముగ్గి వాసనకొడుతోంది.

మాటలు లేవు.

ఆమె గోరింటాకు పండిన చేతివేళ్ళను వయ్యారంగా నేలమీద రాస్తోంది. అతను పిట్టగోడ పగులులో మొలిచిన రావిమొక్కను చూస్తున్నాడు.

"ఏ గ్రూపు తీసుకుందా మనుకుంటున్నావ్?" అంది నిశ్శబ్దాన్ని నెట్టేస్తూ.

"ఏమో! కాలేజీలో చేరుతానో లేదో" అన్నాడు అతను బాధగా.

ఆమె ఉత్సాహంగా ఏదో చెప్పబోయింది. అతను తిరిగి అన్నాడు.

"బాబాయి చదివిస్తాడో లేదో తెలీదు. ఇప్పటికే ఆయన సంపాదన ఖర్చులకు చాలడంలేదు. నేను కాలేజీలో చేరితే బాబాయి అప్పులు చేయాల్సి వస్తుంది. నా తాలూకా

పొలం కొద్దిగా వుంది. అమ్మేయ్యాలని అనుకుంటున్నట్లు మొన్న అమ్మ ఉత్తరం రాసింది. బాబాయేమో, 'ఎందుకూ వద్దు' అంటున్నాడు. ఏం చేస్తారో తెలీదు" అన్నాడు.

"నాకు చదవాలని ఉంది. నాన్నగారు ఏమంటారో" అంది ఆమె.

"మంచిదే, చదువు . మీ నాన్నగారితో నేనూ చెప్తాను చదివించమని" అన్నాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

కిందనుంచి వాళ్ళమ్మ పిలిస్తే యిద్దరూ దిగి వెళ్ళిపోయారు. ఆమె పాయసం పట్టుకొచ్చి యిచ్చింది. "తాగవోయ్, అమ్మాయి పాసయ్యిందిగా " అంది. తాగి, కాస్సేపు కూర్చుని అతను వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భోజనం చేస్తున్నప్పుడు "మొత్తంమీద ఆ పిల్ల భలే గడుసుపిల్లే అబ్బాయ్!" అంది పిన్ని.

అతనికి ఆమె ఏమంటున్నదో అర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు.

భోజనం పూర్తిచేసి, చొక్కా వేసుకుని పరీక్షపోయిన మిత్రుణ్ణి పరామర్శిద్దామని వెళ్ళాడు. కాని అతను లేడు. తిరిగి యింటికి వచ్చాడు. గదిలోకి అడుగు పెడుతున్నప్పుడు పిన్నిమాటలు వినిపించాయి.

".... ఇంత సరదాగా ఇద్దగూ కలిసి తిరుగుతున్నారా, ఎందుకన్నదో అర్థంకాదు! అమ్మాయికూడా పాసయిందని సంతోషంకొద్దీ వాళ్ళింటికి వెళ్ళాను. ఆవిడతో మాట్లాడుతూ కూర్చున్నాను. ఏవో పెళ్ళిళ్ళ గొడవలు వచ్చాయి. వసంతకూడా అక్కడే వుంది. 'కన్నాజీరావును చస్తే పెళ్ళిచేసుకోను' అంది ముఖంమీద పేడనీళ్ళు చల్లి నట్టుగా!"

అసలు నువ్వావిషయం ఎందుకడిగావే? ఇప్పుడప్పుడే వాడికి పెళ్ళేమిటి, పద్దెనిమిదేళ్ళన్నా లేవు".

"మాటవరసకు అన్నాను, ఆవిడ వాళ్ళమ్మాయిని గురించి మాట్లాడుతూ ఎలాటి మొగుడు దొరుకుతాడో అంటే"

కన్నాజీరావు అక్కడ నుంచోలేకపోయాడు. అతనికి వసంత అలా అనడం చాలా బాధగా వుంది. వచ్చినవాడు వచ్చినట్టుగా వీధిలోకి నడిచాడు.

వసంతను ఎప్పుడూ అతను ప్రేమించాననని అనుకోలేదు. వసంతను

చూసినప్పుడు 'ఈమెను పెళ్లిచేసుకోవాలి' అనుకునేవాడు. అతని ఊహలు అంతకన్నా మధురంగా పోలేదు. వసంత తన పెళ్ళాం అయితే – అన్నంతవరకే పరుగెత్తేవి.

ఆమెను గురించి ఆలోచించిన అతనికి ఆమె అలా అనటం బాధ కలిగించింది. ఉక్రోషం వచ్చి 'పోనీ పెళ్ళాడకపోతే పోనీ' అనుకున్నాడు. కాస్సేపు ఎక్కడెక్కడో తిరిగి, యింటికి వచ్చి నిద్రపోయాడు.

మూడు రోజులు పోయాక వసంత అతని ఇంటికి వచ్చింది. అతనికి ఆమె అంటే కోపంగా వుంది. మాట్లాడాలనిలేదు. ముఖం పక్కకు తిప్పుకుని చూడనట్టు నుంచుంటే దగ్గరకువచ్చి "నీ చదువు మాట ఏమయ్యింది?" అంది.

అతను మాట్లాడలేదు.

చుట్టూ తిరిగి అతని ముందుకొచ్చి, "మాట్లాడవేం; నిన్నే, ఇంట్లో చదవ్వద్దని అన్నారా?" అంది.

అయినా అతను మాట్లాడలేదు.

"పోనీ, నే చెప్తాలే ఇంట్లో, చదివించమని". ఆమె లోపలికి వెళ్ళబోయింది.

వసంత గురించి తను బాధపడుతున్నట్టు పిన్నియెదుట తేలిపోవడం యిష్టం లేకపోయింది.

'వొద్దు, ఇల్లారా!' అన్నట్టు కళ్ళతోనే పిలిచాడు.

ఆమె దగ్గరకు వచ్చి నిలుచుంది.

"బి.ఏ. వరకు చదివిస్తామన్నారు" అన్నాడు.

"మరి!" ఆశ్చర్యంగా చూసింది.

అతను మాట్లాడలేదు. 'డాబామీద కురా!' అన్నట్టుగా ముందుకు నడిచిపోయాడు.

ఆమె అతన్ని అనుసరించి వెళ్ళింది.

అతను డాబామీద ఒకవైపుకు తిరిగి చేతులు కట్టుకుని ఆకాశంలోకి చూస్తూ నుంచున్నాడు. అతని వెనుక ఆమె మౌనంగా నిలబడి క్రిందకు చూస్తోంది.

"నన్ను పెళ్ళాడనన్నావటగా" అన్నాడు ఆకాశంలోకి చూస్తూనే.

అంతకన్నా సున్నితంగా ప్రశ్నించడం అతనికి చేతకాలేదు.

"ఎవరన్నారు?"

"పిన్ని"

కిలకిలా నవ్వింది.

"నేను ఇంకా చదువుకోవాలి, ఇప్పుడు పెళ్ళేమిటి అన్నాను. అలా అన కూడదా?" అంది.

అతను మాట్లాడలేదు.

"నన్ను తప్ప యింకెవరినీ పెళ్ళిచేసుకోవా ఏమిటి?" అంది తిరిగి నవ్వుతూ.

దానికీ అతను సమాధాన మియ్యలేదు.

"మాట్లాడకపోతే మీయింటికెప్పుడూ నేను రాను" అంది చిరుకోపం నటిస్తూ.

అతను ఆమెవైపు తిరిగాడు.

"భలేవాడివే, రా! పిన్నిపిలుస్తోంది. అన్నట్టు-రేపు కాలేజీకు వెళ్ళేటప్పుడు నాకూ ఓ అప్లికేషను ఫారం తెచ్చిపెట్టు" అంటూ అతని చేతిని పట్టుకుని కుదిపింది.

ఆమె ముందు వెళ్తుంటే ఆ వెనకనే మెల్లగా మెట్లు దిగుతున్నాడు.

మత్తుగా కళ్ళు మూతలు పడ్డాయి. వసంతా కన్నాజీరావుల ఆలోచన దూరంగా ఎగిరిపోయింది. వాళ్ళ ఆకారాలు అలుక్కుపోయి బూడిదరంగులో కలిసిపోయాయి. రైలు చక్రాల శబ్దం, ఇంజనుకూత, ప్రక్కనే నిద్రపోతున్న వాడి గురక-అన్నీ నిశ్శబ్దంలోకి జారిపోయాయి.

వసంత గబగబా మెట్లు దిగుతోంది. మెట్ల దగ్గర వెలుతురు లేదు. చీకటిగా ఉంది. నేను మెల్లగా తడుముకుని తడుముకుని దిగుతున్నాను.

ఆమె ఆగిపోయి "భలేవారే! అంత భయపడుతున్నవారు చార్మీనార్ చూద్దామని ఎందుకన్నారు?" అంది.

"మీకు అలవాటుమీద భయం అనిపించటంలేదు. అంతకు ముందు ఎన్నిసార్లు వచ్చారో! నాకుమాత్రం కొత్త" అన్నాను.

"మొదట్లో ఒకసారి వచ్చాను. ఆ తర్వాత వాసమూర్తి వచ్చినప్పుడు మరోసారి-అంతే" అంది.

నాకెందుకో అసూయగా వుంది. వసంత, వాసమూర్తి పేరు ఎత్తకుండావుంటే బాగుండును. చార్మీనార్ చివర నుంచున్నప్పుడు నన్ను గట్టిగా పట్టుకున్నట్టే వాసమూర్తినీ పట్టుకుంది గాబోలు!

చార్మీనార్ చిట్టచివర నుంచుని బితుకు బితుకుగా కిందకు చూస్తున్నప్పుడు "జాగ్రత్తండోయ్! కళ్ళు తిరుగుతాయి. మీ చెయ్యి యిల్లా యివ్వండి, పట్టుకుంటాను" అంది. నిజానికి ఆ మాట నేను ఆమెను అనాల్సింది.

కిందకు దిగిపోయి నా గురించి ఎదురుచూస్తూ నుంచుంది. మెల్లగా నేనూ ఆమె దగ్గరకు చేరాను.

"సాలార్‌జంగ్ మ్యూజియం చూడొద్దూ?" అంది.

"చూడాలి" అన్నాను.

అక్కడనుంచి మ్యూజియానికి తీసుకెళ్ళింది. తనే టిక్కెట్లు కొనితెచ్చింది.

"అనాగరికతను మానవుడు ప్రేమిస్తాడు. గౌరవిస్తాడు. జాగ్రత్తగా భద్రపరచి దానికెంతో విలువనిస్తాడు. కాలం విడిచేసిన బాటలో నాశనం కాగా మిగిలిపోయిన ప్రతి వస్తువూ అనాగరికమే. ఈనాటి పనిముట్లతో పోల్చిచూస్తే అవి పాతబడిపోయాయి. మరికొంత కాలంపోతే అవి ఉపయోగించినవాళ్ళు అనాగరికులంటుంది ఈ విజ్ఞానం. అనాగరికతను మానవుడు నాగరికతమధ్య భద్రపరుస్తున్నాడు. వాటికి లెక్కకట్టలేనంత విలువను ఆపాదిస్తున్నాడు."

ఈ మాటలు వసంత లోపలి కళాఖండాల్ని చూస్తున్నప్పుడు అంది. అని, 'ఏమంటారు?' అని నా అభిప్రాయాన్ని అడిగింది. నగ్న సత్యాన్ని ఒప్పుకోకుండా ఎలా వుండనూ?

మెల్లగా ఒక్కొక్కటే చూస్తూ బయలుదేరాం. ఒక చిత్రంముందు ఆగిపోయి "ఆమె ఏం చేస్తున్నదో చెప్పండి చూద్దాం?" అంది.

నదీతీరంలో అందమైన సాయంకాలం చల్లని శీతలవాయువుల మధ్య రాతి పలక మీద మనోహరంగా జారబడి నిశ్చింతగా నిద్రపోతోంది" అన్నాను.

ఆమెనవ్వి "బాహ్యాన్నే తప్ప హృదయాన్ని మీరు చూడలేరు. ఆ హృదయం వెనక సున్నితమైన భావాలు మీకు అర్థంకావు"అంది.

ఆమె వేసిన ప్రశ్నకు, నా సమాధానానికి, దానిమీద ఆమె వాఖ్యానానికి ఎలాంటి సంబంధం వుందో నాకు అర్థంకాలేదు.

ఆమె అక్కడనుండి కదిలింది. ఒక్కొక్క గదే దాటుతూ అందులోని కళాఖండాల్ని చూస్తూ వెళ్తున్నాం. చటుక్కున నాకో అభిప్రాయం తట్టింది. ఇప్పుడే వస్తానని చెప్పి,

అంతకు ముందు ఆమె చిత్రం చూపించి ప్రశ్నించిన గదిలోకి వచ్చాను. అక్కడ వున్న గైడ్'ని ఆ చిత్రం గురించి అడిగాను.

ప్రియుడు వదిలేసి వెళ్ళిపోతే దుఃఖాన్ని భరించలేక మూర్ఛపోయిన స్త్రీ అట!

వసంత అంతకుముందు అలా ఎందుకన్నదో ఇప్పుడు నాకు అర్థమయ్యింది.

నన్ను వెతుక్కుంటూ ఆమె వెనక్కువచ్చింది. "ఏం చేస్తున్నారు"? అంది. "ఇంతకు క్రితం కొన్ని చిత్రాలను చూడలేదు, అవి చూస్తున్నాను" అన్నాను. అబద్ధం ఆడకూడదని ఎన్నోసార్లు అనుకున్నా అదిమాత్రం సాధ్యంకావడంలేదు నాకు.

వసంత అక్కడనుంచి ముందుకు లాక్కుపోయింది.

ఒక గదిలో పాలరాతి శిల్పాలు వరుసగా అమర్చివున్నాయి. వాటిల్లో చాలామట్టుకు నగ్నంగాను, అర్థనగ్నంగాను వున్నవే.

ఆమె ఎదురుగా వాటిని తీక్షణంగా చూడ్డం ఇష్టంలేక చూసీచూడనట్టు వెళ్ళిపోతున్నాను.

"అదేమిటి! అలా వెళ్ళిపోతారు, ఇంత అందమైన కళాఖండాల్ని వొదిలేసి. భలే మనుషులే! కళాదృష్టి లేనట్టుంది మీకు" అంది.

'కళాదృష్టి' అంటే ఏమిటో ఆమెను అడగాలనుకున్నాను. ఆ అవకాశం ఆమె ఇవ్వలేదు.

ఒక శిల్పాన్ని చూపించి "చూడండి-ఇది ఎంత బ్రహ్మాండంగా వుందో. కన్నాజీరావే గాని చూస్తే ఈ శిల్పం దగ్గరనుండి అరగంటవరకూ కదలడు" అంది.

నిజానికి ఆమె చెప్పినట్టు అంత అందంగానూ వుంది ఆ శిల్పం. నగ్నంగా కూర్చున్న ఓ స్త్రీ చిన్నపిల్లాడికి పాలిస్తోంది. పాలరాతిలో ఆ శిల్పం మరీ అందంగా కనిపిస్తోంది. కాని ఎక్కువసేపు ఆ శిల్పాన్ని చూడలేకపోయాను. బహుశా వసంత అన్న కళాదృష్టి నాకు లేదేమో!

మ్యూజియం అంతా చూసి బయటికి వచ్చేసరికి మూడయ్యింది. మధ్యాహ్నం భోజనం చెయ్యలేదనేవిషయం గుర్తొచ్చి ఆకలనిపించింది.

"ముందు ఏదైనా మంచి హోటలు చూపించండి. లేకపోతే మధ్యదారిలో కళ్ళు తిరిగి పడిపోతే ఇంటికి మోసుకెళ్ళాల్సి వస్తుందేమో-మీకు శ్రమ" అన్నాను నవ్వుతూ.

"మిమ్మల్ని మొయ్యడానికి శ్రమపడే వారెవరూ వుండరు లెండి, ఆ భయం అక్కరలేదు" అంది.

మళ్ళీ మాట్లాడలేకపోయాను. నా ఆకారం కేసి ఒకసారి చూసుకుని, కిక్కురుమన కుండా ఆమెను వెంబడించాను.

ఏవో శబ్దాలు, కేకలు చాలా సేపటినుండి అస్పష్టంగా వినిపిస్తున్నాయి. కళ్ళు తెరిచాను. పందుం పుల్లలు అమ్మే కుర్రవాడు కిటికీలో తలదూర్చి మరీ అరుస్తున్నాడు. చీకటి తొలగిపోయి వెలుతురు వ్యాపిస్తోంది. కన్నాజీరావు ఎదుటి సీటులో నిద్రపోతున్నాడు.

"ఏ స్టేషను?" అన్నాను పక్కాయనతో

"కంభంమెట్టు" అన్నాడు.

కన్నాజీర్వావును లేపాను. ముఖం కడుక్కుంటే విజయవాడలో కాఫీ తాగవచ్చని.

కళ్ళు నులుముకుంటూ లేచి "అప్పుడే తెల్లారిపోయిందా!" అంటూ ఆశ్చర్య పోయాడు.

దంతధావనం అయ్యింది. బయటకు చూస్తూ కూర్చున్నాను. విచ్చీ విచ్చని మల్లెమొగ్గలోనే సువాసనా, సౌందర్యం వున్నట్లు, తెల తెలవారుతున్నప్పుడే ప్రకృతి అందంగాను, ఆహ్లాదకరంగాను వుంటుందనిపించింది. చీకటి, వెన్నెల కలిసిన మసక వెలుతుర్ని నెట్టేస్తూ ఉదయపు కాంతి వ్యాపిస్తున్నప్పుడు, ఆ రెండూ కలిసిన వెలుగులో ఎంత అందం వుంది!

"రాత్రి సరిగా నిద్రలేకపోవడం వలన ఆకలేస్తోంది" అన్నాడు కన్నాజీరావు.

"బెజవాడ వస్తోందిగా, బాగా తిందువుగాని."

"అన్నట్టు వాసమూర్తి బెజవాడలోనే వుంటున్నాడుసుమా!"

"ఉద్యోగం చేస్తున్నాడా?"

"ఇప్పుడేం, కాలేజీ వొదిలేసిన దగ్గరనుంచీ పనిచేస్తూనే వున్నాడు-ఫిలిం డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలో. వసంత చెప్పింది – తను ఉద్యోగం గురించి ప్రయత్నం చేస్తూ బెజవాడ వస్తే అక్కడ వాసమూర్తి కలిశాడట"

"ఏడిపించలేదూ?"

"విను. అసలు విషయం చెప్తే నీకే అర్థమవుతుంది."

నేను కిటికీలోంచి చూడ్డంమానేసి అతనివైపే చూస్తూ కూర్చున్నాను. అయిదు నిమిషాలపాటు అతను ఆలోచిస్తూ కూర్చుని చెప్పటం ప్రారంభించాడు.

"రిజల్ట్సు వచ్చిన తరువాత ఉద్యోగం గురించి ప్రయత్నం చేస్తూ వాళ్ళ నాన్నగారితో ఒకసారి బెజవాడ వచ్చింది వసంత. ఎవరో తెలిసిన అతని ఇంటి అడ్రసు పట్టుకొని వెతుకుతుంటే వాసమూర్తి కనిపించాడు. చూడగానే ఆశ్చర్యపోయి అతనే పలకరించాడు. రేడియోలో ఏదో ఉద్యోగం ఖాళీగా ఉన్నదని తెలిసిందట. ఒక పత్రిక ఎడిటరు ఆయనకు సన్నిహిత మిత్రుడుంటే ఆయనతో రికమెండు చేయిద్దామని వచ్చారట.

"ఎక్కడికి వెళ్తున్నారు?" అన్నాడు వాసమూర్తి.

"స్నేహితుడి యిల్లు వెతుకుతున్నాను, దొరకలేదు" అన్నాడాయన. ఆ అడ్రసు అతనికి చూపించాడు. ఆ అడ్రసు ప్రకారం వాళ్ళను ఆ ఇంటికి చేర్చాడు వాసమూర్తి. తనకు అర్జంటుపని వుండడంవల్ల మరునాడు వచ్చి కలుసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ మరుసటిరోజు సాయంకాలం అతను వెళ్ళాడు. వసంత నాన్నగారు లేరు. ఆయనా, ఆయన స్నేహితుడూ-ఇద్దరూ ఎక్కడికో వెళ్ళారట. వసంత ఆ యింటి వాళ్ళబ్బాయిని రెండేళ్ళవాడిని ఎత్తుకొని ఆడిస్తోంది.

"కూర్చోండి!" అని కుర్చీ చూపించింది. అతను కూర్చున్నాడు.

"మీకు పిల్లలంటే ఇష్టం అనుకుంటాను" అన్నాడు నవ్వుతూ.

"ఎత్తుకుంటారా?" అంది ఆమె కూడా నవ్వి.

"ఇవ్వండి."

"వద్దులెండి. తర్వాత నన్ను తిట్టుకుంటారు. ఇప్పటికే నన్ను తిట్టుకున్నది అచ్చులో పెడితే ఓ పెద్ద గ్రంథమంత తయారైవుంటుంది" అంటూ చిలిపిగా నవ్వింది.

పాలిపోయిన మొహంతో అతనుకూడా ఓసారి నవ్వేశాడు.

వసంత ఇంట్లోకి వెళ్ళి పిల్లవాడిని ఇచ్చేసి వచ్చింది. ఏవేవో విషయాలు మాట్లాడిన తర్వాత "ఇంతకూ మీ ఉద్యోగం ఏమయ్యింది?" అన్నాడు.

ఆమె నిట్టూర్చి "అయ్యేట్టు ఏమీ కనిపించడంలేదు. ఆ ఎడిటరుగారికి, రేడియో వాళ్ళకు పడదట, ఏవో కారణాలచేత. 'అయినా ప్రయత్నిస్తాను' అన్నారట. 'ఆ పని

నేను చెయ్యలేను' అనే విషయాన్ని తియ్యగా చెప్పడం అన్నమాట అది" అంది వసంత.

"మరి ఇప్పుడు ఏం చెయ్యదలచుకున్నారు?"

నిజానికి ఈ ప్రశ్న అడగడంలో అర్థంలేదు. అతనుగూడా ఆ ప్రశ్నకు సమాధానాన్ని ఆశించి అడగలేదు. ఏం మాట్లాడాలో తోచక ఆ ప్రశ్నే మనసుకు తట్టితే అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకుని చూస్తోంది.

"పోనీ, నేనొక ప్రయత్నం చేస్తాను. అది నెరవేరుతుందని ధైర్యంగా చెప్పలేను కాని శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను. నాకు తెలిసిన రేడియో ఆర్టిస్టు ఒకాయన వున్నాడు. ఆయనద్వారా స్టేషను డైరెక్టరుకు చెప్పిద్దాం."

అంత నిరాశలోనూ ఆమెకు కొంత ఆశ, కొంత ఉత్సాహం కలిగాయి. కృతజ్ఞతగా అతనివైపు చూసింది.

వసంత నాన్నగారు వచ్చారు. ఆయనతో మాట్లాడి మరుసటి రోజు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. అన్నట్లుగా ఆ మర్నాడు వచ్చి వసంతను, వసంత నాన్నగారిని వెంటబెట్టుకొని అతని మిత్రుడిదగ్గరకు వెళ్ళాడు. ఆయనతో మాట్లాడి ఆమెచేత ఒక అప్లికేషన్ పెట్టించాడు.

"వారం పదిరోజుల్లో ఏ విషయమూ చెప్తాను" అన్నాడు ఆ మిత్రుడు.

వసంతావాళ్ళూ వెళ్ళిపోయారు. ఆ రోజు వాసమూర్తి స్టేషన్‌కు వెళ్ళి ఇద్దర్నీ సాగనంపాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక వసంత దగ్గరనుంచి అతనికి ఉత్తరం వచ్చింది. పదిహేను రోజుల తర్వాత వసంతకు అతను సమాధానం ఇచ్చాడు-ఆ ఉద్యోగం మరొక ఆమెకు వచ్చిందట. మంత్రుల స్థాయిలో రికమెండేషన్ నడిచిందట. ఆ విషయం రాస్తూ ఉత్తరంలో అతను చాలా నొచ్చుకున్నాడు.

ఆ తర్వాత వాళ్ళిద్దరిమధ్యా ఉత్తరాలు నడుస్తుండేవి. మరుసటి సంవత్సరం ఆమెకు హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం రావడానికి పరోక్షంగా వాసమూర్తే కారణం. పత్రికల్లో ఎడ్వర్టయిజ్‌మెంట్ పడితే చూసి ఆమెకు ఉత్తరం రాశాడు. ఆమె అంతవరకూ చూడలేదు. వెంటనే ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టింది. ఆ తర్వాత వాళ్ళ నాన్నగారు ఏవేవో ప్రయత్నాలు చేశారు.

"ఈమధ్య హైదరాబాదు వాసమూర్తి వచ్చినప్పుడు వాళ్ళిద్దరూ చాలా ఖుషీగా తిరిగారు. బస్సుల్లోనో, బజార్లోనో, పబ్లిక్ గార్డెన్సులోనో, టాజ్‌లోనో, దీపక్‌లోనో ఎక్కడో ఒక చోట కనిపిస్తూనే వుండేవారు. ఓ నెల్లాళ్ళపాటైనా అతను ఇక్కడ వుండి వుంటాడు..."

బండి ఏదో స్టేషన్‌లో ఆగింది. కన్నాజీరావు బండి దిగి సిగరెట్లు కొనుక్కొచ్చాడు. అంత ఉదయమే సిగరెట్టు కాల్చాలనిపించలేదు నాకు. అతను కాలుస్తూ కూర్చున్నాడు. బెజవాడ వెళ్ళేవరకూ మరేమీ మాట్లాడలేదు.

బెజవాడలో పైబెర్తు కాళీ అయ్యింది. కాఫీతాగొచ్చి అక్కడకు చేరుకున్నాను. కొద్దిసేపు నిద్రపోతే కాస్త తేలికగా ఉంటుంది.

కన్నాజీరావు ఏదో పత్రిక కొనుక్కొచ్చి చదువుకొంటూ కూర్చున్నాడు. అతని కెదురుగా ఓ అరవామె ప్రళయం తరుముకొస్తున్నట్టుగా భర్తతో మాట్లాడుతున్నా వినిపించుకోకుండా తన చదువులో మునిగిపోయాడు కన్నాజీరావు!

నిజానికి కన్నాజీరావుకు కథలంటే అంత యిష్టంఉండేదికాదు. మొదట్లో అతనికా అలవాటు వసంతే ఏర్పరచింది. ఆమెకు కథలంటే యిష్టం. కథలు రాసి పత్రికలకు పంపుతుండేది. కాలేజీలో రచయిత్రిగా ఆమె పేరు సంపాదించుకుంది. అలా ఆమెకు పేరు రావడానికి కారకుడు కన్నాజీరావు. వసంత అందుకతన్ని అతితెలివిగా ఉపయోగించుకుంది. తన గొప్పతనాన్ని మగవాళ్ళల్లో ప్రచారంచేసే మనిషి ఆమెకు అవసరం. అందుకు కన్నాజీరావు ఉపయోగపడ్డాడు.

అతనంటే ఆమెకెందుకో ఒక విధమైన ద్వేషం. అతను అవునన్నది ఆమె కాదనేది. అతనికన్నా తను తెలివైనదానినని ఆమె అభిప్రాయం. ఆ అభిప్రాయం ఆమెకు చిన్నప్పటి నుంచీ ఉన్నదే.

ఆ మొగ్గల్లా కాలం కప్పిన ముసుగులో రహస్యంగా పెరిగి పగిలి విషవాసనల్ని విరజిమ్ముతోంది.

ఒకరోజు ఆమె పుట్టినరోజు పండగ చేసుకొంది. ఆ రోజు సాయంకాలం టీపార్టీకు ఆమె యింటికి వెళ్ళినప్పుడు ఆమె అభిమానించే వంగ రచయిత పుస్తకం ఒకటి బహుమతి చేశాడు. ఆమె అందుకుని పైన చుట్టిన అట్టవిప్పి 'యింతేనా' అన్నట్టు చూసింది. చుట్టూ చేరిన అరడజను స్నేహితురాళ్ళూ ఫకాలుమని నవ్వారు.

"మీ కన్నాజీరావు నీ కోసం చాలా శ్రమపడి తెచ్చాడు ప్రేమకానుక. భద్రంగా

హృదయంలో దాచుకో" అంది వనలత.

"ఆయనేదో ఉంగరం పట్టుకొస్తాడేమోనని నేను తేవడం మానేసి టాయ్‌లెట్‌సెట్టు పట్టుకొచ్చాను" అంది అజీద్‌బీబి.

ఆ మాటల్లోని వ్యంగ్యానికి అతనికి తల కొట్టేసినట్టయింది. అవమానంతో, అభిమానంతో ఆవేశం రేగి బయటికి రాలేక కన్నీళ్ళల్లో కరిగి కళ్ళలోనే ఇంకిపోయింది.

ఎందుకొచ్చానా అనుకున్నాడు. తను దగ్గర వుండికూడా స్నేహితురాళ్లచేత అవమానిస్తున్నందుకు ఆమెమీద ఎంతైనా కోపం వచ్చింది. అంతకన్న ఎక్కువ ధర పెట్టి కొనేశక్తి లేదు. ఆమెకు సాహిత్యం అంటే యిష్టమని వున్న డబ్బుతో పుస్తకం కొనుక్కొచ్చాడు. తన శక్తి ఆమెకు తెలిసివుండికూడా స్నేహితురాళ్ళని మందలించలేదు ఆమె.

పార్టీ అయ్యేవరకూ ఎలాగో ఓపికపట్టి కూర్చున్నాడు. ఆమె స్నేహితురాళ్ళ యికిలింపులు, వ్యాఖ్యానాలకు అతీతంగా మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

పార్టీ కాగానే వెళ్ళిపోదామని లేచాడు.

"ఏమిటి! సినిమా ప్రోగ్రాం వుంటే వెళ్ళిపోతానంటావు, భలేవాడివే! కూర్చో" అంది వసంత.

"నేను రాలేను. వంట్లో అదోలా వుంది, మీరు వెళ్ళండి" అన్నాడు.

అరడజనుమంది అమ్మాయిలూ అతనిచుట్టూ చేరిపోయారు.

"అదేమిటండీ, మీ వసంత పుట్టినరోజయితే మీరు రానంటారేమిటీ! మంచివారే, కూర్చోండి" అంది సువర్ణ తిలకం.

"కావలసినవారు మీరు లేకుండా మేమంతా ఎందుకు?" అంది వనలత.

వసంతను తన సొంతంచేసి వాళ్ళంతా మాట్లాడుతుంటే, అంతకుముందు ఆమె మీదున్న కోపంఅంతా ఎగిరిపోయింది. వసంత కళ్ళల్లోకి చూశాడు.

'ఊ.. రావాలి' అన్నట్టు చూసింది ఆమె. లేచి నుంచున్న వాడల్లా తిరిగి కూర్చున్నాడు.

మరో అరగంటలో అంతా సినిమాకు బయలుదేరారు. హాలు దగ్గర "ఇవ్వాళ మనల్నందర్నీ సినిమాకు కన్నాజీరావే తీసుకెడతాడు" అంది వసంత.

"వాళ్ళవసంత పుట్టినరోజేగా, తీసుకెళ్ళడేమిటి" అన్నారు అరడజనులో ఒకరు.

అతనికి ఏడుపొచ్చినంత పనైంది. చిల్లరంతా కలిపితే అతని జేబులో రెండు రూపాయలకన్నా ఎక్కువ లేవు. వీళ్ళందరినీ సినిమాకు తీసుకెళ్ళాలంటే పదిహేను రూపాయలన్నా కావాలి. తనదగ్గర డబ్బు లేదనే విషయం తెలిసికూడా, అడిగి తనని చిన్నబుచ్చాలని వసంత చేసిన పనికి అతనికి ఎంతైనా కోపంవచ్చింది. అక్కడనుంచి చరచరా అతను యింటికి వెళ్ళిపోయాడు.

మరో రోజు మరో సంఘటన జరిగింది. అతను పుస్తకాలన్నీ కొనుక్కోలేదు. వసంత వద్దకు వెళ్ళి కావలసినవి తెచ్చుకుని చదివి యిచ్చేస్తుండేవాడు.

ఒక రోజు హిస్టరీగైడ్ గురించని ఆమె యింటికి వెళ్ళాడు. పత్రిక చదువుతూ కూర్చుంది ఆమె. అతను వచ్చినట్టు గుర్తించలేదు. ముందుగా అతనే పలకరించాడు.

"ఏం పనిమీద వచ్చావా?" అంది ఆమె. అసలు, ఆమె అలా అడగడమే అతనికి నచ్చలేదు.

"హిష్టరీగైడ్ కావాలి" అన్నాడు.

"వెళ్ళేటప్పుడు తీసుకు వెళ్ళుదువుగానిలే. నీతో మాట్లాడాలి పైకి వస్తావా" అంది. అని, డాబామీదకు నడిచింది. మౌనంగా ఆమెను అనుసరించాడు.

కూర్చోలేదు. ఇద్దరూ నుంచోనే ఉన్నారు.

"ఇవ్వాళ బోర్డుమీద రాసిన రాతలు చూశావుకదూ" అంది. ఆ మాటలు కోపంతో వంపులు తిరిగాయి.

"చూశాను" అన్నాడు నిర్లిప్తంగా అతను.

"అయినా నీకు చీమకుట్టినట్టయినా లేదన్నమాట?"

అతనికి ఆమె మాటలు వింతగా అనిపించాయి. ఆశ్చర్యంగానే ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"కాలేజీకు రావడమే కష్టమవుతోంది. కనిపించిన ప్రతి వెధవా ఇద్దరి పేర్లూ కలిపి ఏడిపించడమే. మొన్న అమ్మా, నేనూ అంతా సినిమాకు వెడితే, ఓ వెధవాయి 'పాపం యింటల్లుడు రాలేనట్టుంది' అన్నాడు గట్టిగా. మొన్నటికి మొన్న-లేడీస్ వెయిటింగ్ రూమ్‌కి వెడుతుంటే గుంపులోంచి ఓ రాలుగాయి 'రాత్రికి కన్నాజీరావుని వదిలిపెట్టాలి. సినిమా ప్రోగ్రాం ఉంది' అంటూ కూశాడు. ఎవడుకూశాడో సరిగా కనిపించలేదు. లేకపోతే యింటిముఖం పట్టించేదాన్ని. అసలు దీనికంతటికీ కారణం

నువ్వే. నువ్వు గట్టిగా మాట్లాడితే వీళ్ళంతా ఎందుకిలా అంటారు? వాళ్ళనని ఏంలాభం, నిన్నాలిగాని" అంది వసంత.

ఇందులో తన తప్పేమిటో అతనికి అర్థంకాలేదు. అతను నవ్వి "ఇలా ఉడుక్కుంటావు కాబట్టే వాళ్ళు మరీ ఏడిపిస్తుంటారు" అన్నాడు.

అతను నవ్వుతోంటే ఆమెకు కోపం ముక్కు చివర పదునులో మెదిలి,క్రింద గాడిలోకి జారి, పెదాల్ని పట్టి ఒక్క కుదుపు కుదిపింది.

"అవును. నీకు నవ్వులాటగానే ఉంటుంది. ఆడదాని పేరు తగిలించుకుని మురిసిపోతున్నావు. ఇలా నలుగురికీ చెప్పుకుని మురిసిపోవటంలో అర్థం ఏమిటి-నిన్ను తప్ప యింకెవరినీ పెళ్ళిచేసుకోగూడదని శాసించడమేగా. అంత స్వార్థం మనిషికి పనికి రాదు..."

కన్నాజీరావు ఏమీ మాట్లాడలేకపోయాడు. అరగంటసేపు అక్కడే మౌనంగా నుంచుండిపోయాడు. రెండేళ్ళ క్రిందట పిన్నితో. 'కన్నాజీరావును నేను పెళ్ళిచేసుకోను' అన్నవాక్యానికీ, యివ్వాళ వసంతమాటలకూ అతనికి యిప్పుడు అర్థం బోధపడింది. ఆమె తనకెంత దూరంలో ఉన్నదీ తెలుసుకోగలిగాడు.

పుస్తకం పుచ్చుకోకుండానే వెళ్ళిపోయాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరిమధ్యా మరింత దూరం ఏర్పడింది.

ఇద్దరి రూపాలూ రైలు చక్రాల శబ్దంలోపడి గిరిగిరా తిరిగి చీకటై వెలుతుర్లోకి జారి మాయమయ్యాయి. మనస్సు స్వాధీనంలోంచి దొర్లి, జాగ్రదావస్థలో బోర్లాపడి లేచి, వళ్ళుదులుపుకుని కలలోకి కదిలి వెళ్ళిపోయింది.

వసంత వయ్యారంగా చేతుల్ని కట్టుకుని మెల్లగా నడుస్తోంది. పబ్లిక్ గార్డెన్స్‌లో సగానికి పైగా తిప్పి జంతువుల్ని, పక్షుల్ని చూపెడతానని మరోమూలకు తీసుకొచ్చింది. ఆమె పక్కనే మౌనంగా నడుస్తున్నాను.

"ఆ లేడి ఎంత బావున్నదో!" అంది.

సీతాదేవి శ్రీరాముడితో అలా అనడం జ్ఞాపకానికొచ్చింది. కాని 'కావాలా?' అని అనలేకపోయాను.

పెద్దపులులు, కోతులు, ఎలుగుగొడ్డులు, రకరకాల పక్షులు, రంగుల సీతాకోక చిలుకలు, వాటిని చూడడానికొచ్చే పన్నల విసనకర్రలు, అందాన్ని ముసుగుల్లో

సమాధిచేసిన ఆడవాళ్ళు... ఇంకా...ఇంకా....

ఓ అందమైన అమ్మాయిని చూస్తోంటే ఆమె ఆగిపోయి నవ్వింది. నన్ను చూసేమో అనుకున్నాను. వసంత స్నేహితురాలు కాబోలు, నవ్వుతూ దగ్గరకొచ్చి "ఇవ్వాళ ఆఫీసుకు రాలేదేం?" అంది.

"ఏమీలేదు, ఇవ్వాళ కాస్త పనితగిలింది" అంది వసంత, వంపుగా నావైపు చూసి మెల్లగా నవ్వి.

ఆమెను నాకు పరిచయం చేసింది. రేడియోలో పాడుతుందట. నన్నామెకు పరిచయం చేసింది.

"ఈయన ఆంధ్రదేశంలో పేరు మోసిన పెద్ద ఏక్టరు. చాలా నాటకాలు వేసి పెద్దవాళ్ళ ప్రశంసల్నీ, బహుమతుల్నీ సంపాదించుకున్నారు. క్రిందటేడు ఢిల్లీలో ఓ నాటకం వేసినప్పుడు అక్కడి ఆంధ్రులు ఘనంగా సన్మానించి 'నాట్యశేఖర' బిరుదుకూడా యిచ్చారు. ఈ మధ్యనే సినిమా ఆఫర్ ఒకటి వచ్చింది" అంది.

ఆమె నన్నలా పరిచయం చెయ్యడం చాలా విచిత్రంగా వుంది. ఇంతవరకూ కనీసం ఒక్క నాటకంలో వేషంకూడా వెయ్యలేదు. అసలు నేను నాటకాలనే చూడను. ఆమె అలా ఎందుకు చెప్పిందో అర్థం కాలేదు. నన్ను భంగపరచడానికేమో అనిపించింది. ఆమె మీద చాలా కోపం వచ్చింది. కోపంతోనే ఆమె ముఖంలోకి చూశాను. కళ్ళతో నవ్వేసి "రండి వెళ్దాం" అని, ఆమె వద్ద సెలవు తీసుకుని బయలుదేరింది.

జూబ్లీ హాలుముందు గడ్డిలోకొచ్చి "కూర్చుందామా" అంది. సమాధానం చెప్పకుండానే కూర్చున్నాను. ఆమెమీది కోపంతో ఏమీ మాట్లాడాలనిపించలేదు.

అయిదు నిమిషాలు ఆమెకూడా మౌనంగా కూర్చుని "ఎల్లా ఉంది పబ్లిక్ గార్డెన్స్?" అంది.

కోపం పట్టలేక "నా కథల్లో ప్రేయసీ ప్రియులు కలుసుకునే స్థలంలా ఉంది" అన్నాను. ఆమె నవ్వి 'కాదామరి!' అన్నట్టు చూసింది.

చాలా సేపు ఆమె ఆఫీసు విషయాలూ, అక్కడి మనుషుల గురించీ చెప్తూ కూర్చుంది. పరధ్యానంగా వింటూ కూర్చున్నాను.

మబ్బులు దట్టంగా ఆకాశానికి ముసుగు కప్పాయి. గాలి చల్లగా వీస్తోంది. ఆమె తలలో వాడిన దవనం పరిమళం మత్తుగా నా ముఖాన్ని తాకుతోంది.

వర్షం వస్తుందేమోనని భయంగా ఉంది. లేచి బయలుదేరాం.

బస్‌స్టాప్ చేరి బస్సు ఎక్కినతర్వాత అనుకున్నట్టే కుండపోతగా వర్షం ప్రారంభమయింది.

"ఇంకా నయం తడవలేదు" అన్నాను.

"వర్షంలో తడిస్తే ఎంత బావుంటుందో!" అంది వసంత.

'తడవలేకపోయారా?' అందామనుకున్నాను.

ఆమాటే వెనకనుంచి ఎవరో అనేశారు! ఆశ్చర్యంతో యిద్దరమూ వెనక్కు తిరిగాం.

బక్కపలచగా, ఎర్రగా ఉన్న ఒకాయన సన్నగా నవ్వుతూ "పబ్లిక్ గార్డెన్స్ నుంచా?" అన్నాడు వసంతను ఉద్దేశించి.

"ఆఁ.... అక్కడనుంచే, మీ భాగ్యలక్ష్మి కనిపించింది-ఒంటరిగా. మీరు యివ్వాళ కలుసుకోలేదా?" అంది వసంత.

"లేదు. వేరే పనుండి కలవడం పడలేదు" అన్నాడతను!

ఆ తర్వాత వాళ్ళిద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. అంతగా ఆ సంభాషణ నాకు అర్థంకాలేదు. అర్థం చేసుకున్నదాన్నిబట్టి అది ఓ అమ్మాయి—బహుశా భాగ్యలక్ష్మిమీద జరిగిన సంభాషణ.

ఆమె టికెట్టు తీసుకుంది.

రెండు స్టాపుల తర్వాత అతను దిగిపోయాడు.

'అతనెవరూ?' అన్నట్టుగా ఆమెవైపు చూశాను.

"ఇందాక గార్డెన్సులో కనిపించిందిగా స్నేహితురాలు-ఆమెకు కాబోయే భర్త. అంటే-ఇద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకోబోతున్నారు. ఇతను అప్పుడప్పుడు రేడియో నాటకాల్లో పాల్గొంటాడు. నాటకాలంటే మహాపిచ్చి" అంది.

అంతకు ముందు స్నేహితురాలుకు నన్నొక పెద్ద ఏక్టరుగా ఎందుకు పరిచయం చేసిందో, అలా చెయ్యడంలో ఆమె అభిప్రాయమేమిటో ఇప్పుడు తెలిసింది. ఆమె మీద నాకు ముందటి కోపం లేదు. నవ్వుకున్నాను.

వర్షం యింకా అలా కురుస్తూనే వుంది.

నేను బస్సులో సంపెంగ పరిమళాలను వెతుకుతున్నాను.

'దిగండి' అని ఆమె చెయ్యపట్టుకుని కుదిపేవరకూ నా ఆలోచనలు వసంతవైపు మళ్ళలేదు.

"అదేగా ఇల్లు. ముందు ఇలా రండి, తర్వాత ఆలోచిద్దాం" అంటూ యింటికి దారితీసింది.

చిన్న పిల్లల్లా పరుగెత్తడం యిష్టంలేక సగంసగం తడిసి ఆమె ఇంటికి చేరుకున్నాం.

తలుపుతీసి లైటు వేసింది.

ఆమె వర్షంలో ఎందుకు తడవాలనుకున్నదో యిప్పుడు అర్థమైంది. వర్షంలో తడిసినప్పుడు ఆమె శరీరంలోని భాగాలు, వంపులు మరీ అందంగా కనిపిస్తాయి. ఎగ్జిబిషన్‌లో పాలరాతి శిల్పం జ్ఞాపకానికొచ్చింది నాకు.

"చొక్కా పూర్తిగా తడిసినట్టుంది. విప్పి ఆరబెట్టండి. ఇప్పుడే వస్తాను" అని ఆమె మరో గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఒకే గదిలో బతికే జీవితాల గతేం కాను?-అనిపించింది నాకు.

పావుగంట తర్వాత ఆమె తలుపులు తీసుకుని వచ్చింది. అరచేతి వెడల్పు నల్లంచుల అరవింద రంగు చీర కట్టుకుంది. పసుపు పూల జాకెట్టు తొడుక్కుంది. తలకూడా దువ్వినట్టే అనిపించింది. ముంగురులు చెదిరి ఎగరడంలేదు.

వచ్చి ఎదురుగా కూర్చుంది.

చీర మడతలు పడ్డచోట చీకట్లు దాగి వెలుతుర్ని వెక్కిరిస్తున్నాయి. సన్నని ఒంటిపేట గొలుసు చీర అంచులో కరిగిపోయింది. జాకెట్టు పూల పరిమళంలా ఉండిఉండి దవనం గుప్పుమంటోంది.

"అన్నట్టు వాసమూర్తి పెళ్ళట. శుభలేఖ పంపించాడు" అంటూ టేబిలు మీది కవరు తెచ్చి చేతికిచ్చింది.

లేఖలో పెళ్ళికూతురి పేరు వెతుకుతున్నాను నేను.

"ఆ మధ్య హైదరాబాదు వచ్చినప్పుడే సంబంధం స్థిరపడిందని చెప్పాడు. విశేషమేమిటంటే మరో ఏడాదిపోతేగాని అప్పుడే పెళ్ళిచేసుకోనన్నవాడు రెండు నెలలు తిరక్కుండానే శుభలేఖ పంపించాడు" అంది తిరిగి వసంత.

నవ్వుతోంది.

ఆ నవ్వులో అసూయను వెతికి అలసి తల వంచుకున్నాను.

వాసమూర్తికి పెళ్ళయితే తను బాధపడదేమిటి చెప్మా అనిపించింది నాకు. పదిమందిలో వాసమూర్తి కూడా ఒకడు-అని చెప్పుకుని తృప్తి పడ్డాను.

"మీరు పెళ్ళి ఎప్పుడు చేసుకుంటారు?"

ఆ ప్రశ్న ఆమె వేస్తుందని నాకు తెలుసు. అభిమానం వ్యక్తంచేసే స్త్రీ ముందు నుంచుని మాట్లాడుతున్నప్పుడు పెళ్ళికాని ఏ పురుషుడూ ఈ ప్రశ్ననుంచి తప్పించుకోలేడు.

"పెళ్ళాన్ని భరించగలిగేప్పుడు" అన్నాను.

నవ్వుతూ మెలికలు తిరిగిపోయింది ఆమె. ఆ వంపుల్లో దీపం వెలుతురు చీకట్లను చీల్చుకుని, కరిగి, క్షణం సేపు మేఘాలమధ్య మెరుపులా జిగేల్మంది.

"మిమ్మల్ని భరించే పెళ్ళాం అక్కర్లేదన్నమాట?" అంది. అని పకపకా నవ్వుతోంది.

ఇంత పచ్చిగా మాట్లాడే స్త్రీ ముందు ఎలా కూర్చోనూ?

నా భావాన్ని పసిగట్టినట్టుంది. "అంటే ఉద్యోగంచేసే పెళ్ళాం అక్కర్లేదా మీకు?" అంది తిరిగి.

నేనేమీ మాట్లాడలేదు. ఆమె తెలివికి లోలోపల నవ్వుకున్నాను.

పనిపిల్ల వర్షంలో తడిసి కేరియరు తెచ్చింది. నన్ను కూడా భోజనం చెయ్యమంది. చేసేవరకూ ఊరుకోలేదు.

భోజనం అయినతర్వాత వర్షం ఎప్పుడు వెలిసిపోతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను. పది దాటింది. అయినా వర్షం తగ్గినట్టనిపించలేదు. సగం సగం తడిసయినా రిక్షాలో వెళ్ళిపోదామని లేచాను.

"వర్షంలో ఏం వెళతారు, కూర్చోండి" అంది. మరో గంట కూర్చున్నాను.

వర్షం తగ్గినట్టేతగ్గి తిరిగి కుండపోతగా కురుస్తోంది.

"పోనీ యీ రాత్రికి యిక్కడే వుండిపోండి, ఉదయం లేచి వెళ్ళుదురుగాని" అంది.

"ఇక్కడా!" అన్నాను అప్రయత్నంగానే.

"ఏం, భయమా?"

ఆ 'భయం' అనేది ఏ పదానికి అర్థంగా వాడిందో ఊహించుకోగలిగాను. అసలు నేనలా అనకుండా ఉండాల్సింది.

"నాగురించి మిత్రుడు ఎదురు చూస్తుంటాడు" అన్నాను.

"ఫరవాలేదు, ఆదదికాదుగా. ఆడదైతే నేనేమి అభ్యతరం చెప్పను. కళ్ళల్లో వత్తులుంచుకుని కావలసిన వ్యక్తి గురించి సంవత్సరాలు, యుగాలు నిరీక్షించే శక్తి ఒక్క స్త్రీకే ఉంది. అలాంటివారిని నేనేమీ బాధించను" అంది వసంత.

ఇంత అర్థవంతంగా మాట్లాడే శక్తి ఆమెకు చిన్నప్పటినుంచీ ఉన్నదే. అలామాట్లాడ గలిగేవారు లెక్కపెడితే ఎంతమంది ఉంటారు!?

మనసులో కుతూహలంగా ఉంది. అభ్యంతరం చెప్పనే ఉండిపోయాను.

ముందు గదిలో నాకు పక్క వేసింది, తాను రోజూ నిద్రపోయే మంచంమీద. అవతలిగదిలో తను వేసుకుంది. మంచినీళ్ళవీ పెట్టి వెళ్ళిపోయింది.

తలుపులు వేసుకోలేదు.

మధ్య నీలంరంగు కర్టెను అప్పుడప్పుడు చల్లగాలికి సిగ్గుపడి దగ్గరకు ముడుచు కొంటోంది.

దీపం ఆర్పి మంచం మీదకు వాలాను. తలగడమీద నలిగిన వింత పరిమళాలు తేనెటీగల్లా చెదిరి చుట్టూ ఎగురుతున్నాయి. పక్క గదిలోంచి అప్పుడప్పుడు గాజులు కదిలిన శబ్దం వినిపిస్తోంది.

నిద్ర వస్తోన్నా బలవంతంగా ఆపుకున్నాను. ఎప్పుడో మధ్య రాత్రిలో ఆమె నాదగ్గరకు వస్తుందని నాకు తెలుసు. అలానే మేలుకొని ఉన్నాను-గడియారపు చప్పుడ్నీ, ఆమె కదలికలోని ప్రతి శబ్దాన్నీ, సిగ్గుతో మూసుకొనిపోతున్న కర్టెను రెపరెపల్నీ ఆలకిస్తూ.

తెల్లవారినట్టు కాకులు అరుస్తున్నాయి కాని ఆమె రాలేదు.

ఉదయం స్నానం అదీ అక్కడే చేసి, ఆమె యిచ్చిన టిఫిను, కాఫీ పూర్తిచేసి వెళ్ళిపోతున్నానని చెప్పి బయలుదేరాను.

వసంత గుమ్మంవరకూ వచ్చి"రచయితకదా మీరు. అనుకోకుండా మీ జీవితంలో ఒక అధ్యాయాన్ని అయిపోయాను. ఎప్పుడయినా ఖాళీగా ఉన్నప్పుడు ఆ అధ్యాయాన్ని ఒకమారు చదువుకుని ఉత్తరాలు వ్రాస్తూ ఉండండి" అంది.

"అలానే" అని బయలుదేరాను. దారి తెలియని బాటల్లోంచి అలా నడిచి వెళ్ళిపోతున్నాను.

తెలివి వచ్చేసింది.

కన్నాజీరావు భుజంపట్టి కుదుపుతూ ఇంటికి వెళ్ళి నిద్రపోదువుగానిలే, ఊరువచ్చేసింది. పక్క స్టేషనే" అంటున్నాడు.

లేచి గబగబా బెడ్డింగు సర్దుకుని, సామానంతా ఒక దగ్గరకు చేర్చుకుని కూర్చున్నాను. కన్నాజీరావు నిశ్చలంగా నావైపే చూస్తున్నాడు. బండి ఔటర్ సిగ్నల్‌ని దాటింది.

"హైదరాబాదులో వసంతను కలుసుకున్నాను. ఒక రోజల్లా కూడాఉండి ఊరంతా చూపించింది" అన్నాను.

"అతను ఆశ్చర్యపోయాడు.

"మొదట్లో అడిగితే కలుసుకోలేదన్నావేం?" అన్నాడు.

నాకెందుకో నిజం చెప్పాలనిపించలేదు. నవ్వి ఊరుకున్నాను.

"అయితే నిన్నూ ఓ ఆట ఆడించిందన్నమాట!" అన్నాడు అదోలా నవ్వుతూ.

నా మనస్సు చివుక్కుమంది. స్వార్థంతో అబద్ధం ఆడి వసంతను మరీ చెడ్డదానిలా చేస్తున్నాననిపించింది. నిజానికి ఆమెను అంత చెడుగా సృష్టించడం అసలు నా ఉద్దేశం కానేకాదు.

వసంత విషయంలో చాలా పొరపాటు చేశాను నేను. పరిమితమైన భావాలతో వసంతను సరిగా అర్థంచేసుకోలేక మొదట్లో మీ అందరితో 'వసంత కనిపించిన మగవాళ్ళందరి జీవితాలతోటీ సరదాగా చెలగాటమాడుతుంద'ని చెప్పి నమ్మించాను. మీ కళ్లకు రంగుటద్దాలు తగిలించి, ఆ అద్దాల్లోంచి, ఆమెను చూడమన్నాను. ఆమెను సరిగా అర్థంచేసుకోకపోవడం అది నా అల్పత్వం.

నా అల్పత్వం కారణంగా మీ అందరితోటీ ఆమెను చెడుగా ఊహింపచెయ్యడం నా కిష్టంలేదు. కన్నాజీరావు, వాసమూర్తి, నేను-ఎవరమూ ఆమెను సరిగా అర్థంచేసుకోలేదు.

కన్నాజీరావు, ఆమె తన జీవితంతో చెలగాటం ఆడిందని అనుకోవడంలో అర్థంలేదు. ఎప్పుడూ ఆమె అతన్ని ప్రేమించలేదు. తన అవసరాల్ని తీర్చుకోడానికి ఒక వస్తువుగా అతన్ని ఉపయోగించుకుంది. చిన్నప్పుడు గుర్రబ్బండి ఆటలో, పెద్దయినతర్వాత బొమ్మలు నోట్సులు రాయించడంలో, ఆ తర్వాత మగాళ్ళకు తన గొప్పతనాన్ని తెలియజేయడంలో ఆమె ఆధిక్యత వ్యక్తపడుతూనే ఉంది. తనంతతానుగా

ఆ విషయాన్ని చెప్తేగాని అతను గుర్తించలేకపోయాడు. ఆమె, తనముఖంమీద ఆ విషయం చెప్పిందని ఆమెను కన్నాజీరావు తప్పుపట్టడం మంచిపని కాదు.

వాసమూర్తిని ఆమె మొదట్లో ఏడిపించి, ఆ తర్వాత అతని సహాయాన్ని పొంది, అతనికి కృతజ్ఞత చూపించడంలో ఆశ్చర్యంలేదు. నాతో సన్నిహితంగా, సరదాగా తిరిగినట్టుగానే అతనితోనూ తిరిగిందని ఎందుకనుకోకూడదు? ఆమెను అర్థంచేసుకోలేక కన్నాజీరావు రంగుటద్దాల్లోంచి చూపించాడు నాకు. అలానే చూశాను నేను.

బండి స్టేషన్లోకొచ్చి ఆగింది.

సామాన్లు పోర్టరు నెత్తికెత్తి వెళ్ళిపోతూ "వసంతను మనం సరిగా అర్థంచేసుకోలేదోయ్. నువ్వూ, నేనూ, వాసమూర్తి అంతా ఆమెను అర్థంచేసుకోవడంలో పొరపాటు పడ్డాం. ఆమె చాలా మంచిది" అన్నాను.

అతను క్షణంసేపు విచిత్రంగా నావైపు చూసి పకపకా నవ్వేశాడు. నేనేమీ మాట్లాడదలచుకోలేదు. అతను ఎందుకు నవ్వాడో నాకు తెలుసు. కాని, నేను మీకు చెప్పను.